క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

కూకట్‌పల్లి: పర్వత్‌నగర్‌లోని జనప్రియనగర్‌లో నిర్మాణంలో ఉన్న హనుమంతుని ఆలయాన్ని గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శరణ్ చౌదరి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణం కోసం తన వంతు కృషి చేస్తానని ఆలయ కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. ఆలయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఓబీసీ వైస్ ప్రెసిడెంట్ పులిగొళ్ల శ్రీనివాస్‌యాదవ్, సభ్యులు ఆదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేస్తున్న రవికుమార్ యాదవ్

ఆల్విన్‌కాలనీ: సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం హైదర్‌నగర్, వెంకటేశ్వరనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ట్రస్ట్ సెక్రటరీ రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ.. 15వేల నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో నవీన్‌గౌడ్, నర్సింగ్‌రావు, శేషయ్య, రామ్‌రెడ్డి, చారి, సీతారామరాజు, అరుణ్‌కుమార్, వేణుగోపాల్ యాదవ్, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల నిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ

బాలానగర్: అంతర్గత రోడ్ల నిర్మాణంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. గురువారం పైపులైన్ రోడ్డు వద్ద అంతర్గత రోడ్డు వేయాలని స్థానికులు కోరారు. దీంతో ఆయన ఏఈ పవన్‌ను పిలిపించి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం సీసీ రోడ్డు పనులకు వీలైనంత త్వరగా శ్రీకారం చుట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని బస్తీల్లో నూతన వీడీసీసీ రోడ్లను ఏర్పాటు చేశామన్నారు. రోడ్లతో పాటు మంచి నీరు, డ్రైనేజీ పైపులైన్ పనుల ఆధునీకరణ కూడా చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్‌వెంకటేష్, డి. వెంకటేష్, డాక్టర్ శరత్‌బాబు, నాగరాజు పాల్గొన్నారు.

తైక్వాండోలో ప్రతిభ చూపిన అరుషికి అభినందనలు


అరుషిని అభినందిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీకి చెందిన మార్షల్ ఆర్ట్స్ ఫిట్‌నెస్ అకాడమీ విద్యార్థి నాగసాయి అరుషి కాంస్య పతకం సాధించింది. జూలై 28న లక్నోలో జరిగిన ఆరో తైక్వాండో జాతీయ చాంపియన్‌షిప్–2023లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి కాంస్యం పతకం సాధించిన సందర్భంగా గురువారం అరుషిని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ కోచ్ మధుసూధన్, అరుషి తండ్రి పవన్‌కుమార్, పార్టీ నాయకులు కోనేరు ప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల ఇవ్వాలి

ఆల్విన్‌కాలనీ: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు విషయమై ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి ఇళ్ల స్థలాలు కేటాయించాలని టీయూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు కోరారు. గురువారం కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కరీం, కార్యదర్శి రంజిత్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరెకపూడి గాంధీలను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇరువురు ఎమ్మెల్యేలు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మాఫీసల్ కమిటీ సభ్యులు రవీందర్, ప్రెస్‌క్లబ్ నాయకులు జైకుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భాగ్యనగర్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ శ్రీరాంనగర్ ఫీడర్ పరిధిలోని శ్రీరాంనగర్, సాయి చరణ్ కాలనీ, తులసినగర్ కమ్యూనిటీహాల్ వెనుక భాగంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..

◆ ఎన్టీఆర్‌నగర్ ఫీడర్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్, పీజేఆర్‌నగర్, మొగులమ్మ బస్తీల్లో మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 4.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

సిబ్బంది లేక ఇబ్బందులు

- పర్వతనగర్‌లో పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్యుల కొరత
- వంద పడకల ఆస్పత్రిగా మార్చాలని డిమాండ్
- జనాభాకు అనుగుణంగా సిబ్బందిని నియమించాలని వినతులు
- అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని విజ్ఞప్తులు


పర్వత్‌నగర్‌లోని ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రం భవనం

మోతీనగర్: సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం పూర్వ మోతీనగర్ డివిజన్‌లోని పర్వత్‌నగర్‌లో ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు. ప్రస్తుతం ఈ ప్రాంతం అల్లాపూర్ డివిజన్‌లోకి వస్తుంది. ఈ ప్రాంతంలో ఎక్కువ శాతం ప్రజలు నిరుపేదలే నివసిస్తుంటారు. వారందరికి పర్వత్‌నగర్ ఆస్పత్రి మాత్రమే అందుబాటులో ఉంది. 10 పడకల ఆస్పత్రి కావటంతో అందులోనే ప్రసవగది, సాధారణ పేషెంట్లు ఉండే గదులు ఉన్నాయి. ఆరు మంది నర్సులతో పాటు ఒక వైద్యురాలు, 20 మంది ఆశావర్కర్లు, ఒక ఆయా మాత్రమే ఉంది.

స్టాఫ్ నర్సులే ప్రసవాలు చేస్తున్న వైనం..

జనాభాకు అనుగుణంగా ఈ ఆరోగ్య కేంద్రంలో ఎక్కువ మంది వైద్యులు, సిబ్బందిని నియమించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. సరిపోయేంత సిబ్బంది లేకపోవడంతో ప్రసవాలు చేయటానికి ప్రత్యేకంగా మహిళా వైద్యురాలు లేకపోవటంతో గర్భిణులు వేరే ప్రాంతానికి వెళుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఉన్న వైద్యుడితో పాటు స్టాఫ్ నర్సులే ప్రసవాలను చేస్తుండటం గమనార్హం. అత్యవసర సమయాల్లో కొండాపూర్, బాలానగర్ వంటి ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తెలంగాణ డయాగ్నొస్టిక్ పేరుతో కొన్ని పరీక్షలు మాత్రమే కాకుండా అన్ని పరీక్షలు నిర్వహించాలి.



వాచ్‌మెన్ లేక నిత్యం చోరీలు...

రాత్రి వేళల్లో వాచ్‌మెన్ లేకపోవటంతో ఆస్పత్రి పరిసర ప్రాంతాలు తాగుబోతులకు అడ్డాగా మారిందని స్థానికులు చెబుతున్నారు. దొంగలు పడి విలువైన వస్తువులు దోచుకెళ్తున్నారు. గతంలో ఆస్పత్రి ఆవరణలో ఉన్న ఏసీ కంప్రెషర్‌తో పాటు కులాయి టాప్‌లను సైతం ఎత్తుకుపోయారు. రాత్రయిందంటే ఎక్కుమంది నర్సులు మాత్రమే రాత్రివేళల్లో ఉండటంతో చోరీలు జరుగుతున్నాయి. స్వీపర్‌లు కూడా లేక పోవటంతో ఆస్పత్రి పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. ప్రహరీ చుట్టుముట్టు పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. మొలవటంతో విషసర్పాలు వచ్చే ప్రమాదం ఉంది.


అపరిశుభ్రంగా ఉన్న ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రం భవనం

సిబ్బందిని పెంచేందుకు కృషి చేస్తాం..

ఈ ఆస్పత్రిలో పాము, కుక్కకాటుకు సంబంధించిన వైద్యంతో పాటు వ్యాక్సిన్‌లు కూడా అందుబాటులో ఉంచాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. పుట్టిన శిశువుకు సరిపోయేంత మందులు, వ్యాక్సిన్లు అందుబాటులో లేకపోవటంతో చిన్నారుల తల్లిదండ్రులు వివిధ ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయమై మేడ్చల్ జిల్లా ఉప వైద్యాధికారి కె. ఆనంద్‌ను 'సాక్షి' వివరణ కోరగా ఆస్పత్రిలో సిబ్బంది లేకపోవటం గుర్తించామన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపి సిబ్బందిని పెంచే విధంగా కృషి చేస్తామని తెలిపారు.

రోగులు ఇబ్బందులు పడుతున్నారు..



కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో ఇటీవల ఆస్పత్రిలో రూ.50లక్షలతో వసతులు కల్పించారు. కానీ ఆస్పత్రిలో సరిపడ వైద్యులు, నర్సులు లేరు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఉన్న 10 పడకల ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా మార్చాలి.

– ఎండీ జాహెద్, అధ్యక్షుడు పర్వత్‌నగర్

వరద బాధితులను ఆదుకోండి

కూకట్‌పల్లి: వరద బాధితుల సహాయార్థం సీపీఎం కూకట్‌పల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం కేపీహెచ్‌బీ సౌత్‌ఇండియా షాపింగ్ మాల్ నుంచి కళామందిర్ బస్ స్టాప్ వరకు షాపుల్లో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా నాయకులు శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో భారీ వర్షాల కారణంగా భూపాలపల్లి, ములుగు, వరంగల్ జిల్లాలో మొరాంచపల్లి, భద్రాచలం తదితర ప్రాంతాల్లో వరదలు వచ్చి గ్రామాలు మొత్తం నీట మునిగాయని దీంతో ఇంట్లో వస్తువులన్నీ వదిలి ప్రాణాలను కాపాడుకున్నారన్నారు. దీంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారికి ప్రభుత్వం వెంటనే సహాయ చర్యలు చేపట్టి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని మండలాలు, జిల్లాల్లో విరాళాలు సేకరించి వారికి సహాయం చేయాలని పిలుపునిచ్చారని తెలిపారు.


వరద బాదితుల సహాయార్థం విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

ప్రతి ఒక్కరూ సహకరించి విరివిగా విరాళాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె. కృష్ణనాయక్, పి.ధర్మారావు, బి.రాజులు, జి.మల్లయ్య, రాఘవరావు, రాములు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గీతంలో బీఏ, ఎంఏ అడ్మిషన్లు

పటాన్‌చెరు టౌన్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను బీఏ, ఎంఏ కోర్సులలో ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతున్నట్లు గురువారం ఒక ప్రకటనలో విశ్వవిద్యాలయ వర్గాలు వెల్లడించాయి. బీఏ (ఎకనామిక్స్, ఇంగ్లిషు, హిస్టరీ, మాస్ కమ్యూనికేషన్, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, విజువల్ కమ్యూనికేషన్ ,డ్యాన్స్(భరతనాట్యం, కూచిపూడి/మోహినీయాట్టం)ఎంఏ (ఎకనామిక్స్, ఇంగ్లీషు) కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.కనీస అర్హత పరీక్షను 50 శాతం మార్కుల సగటుతో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు గీతం ప్రవేశ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు.ఇతర వివరాల కోసం 08455-221396 ను సంప్రదించాలని సూచించారు.

అగ్నిప్రమాదం

గచ్చిబౌలి: కొండాపూర్ డివిజన్‌లోని డైమండ్ హిల్స్‌లో అగ్నిప్రమాదం జరిగింది. డైమండ్‌హిల్స్‌లోని కారు లాంజు షోరూమ్ వెనుక ఉన్న స్థలంలోని రెండు గుడిసెలు దగ్ధం అయ్యాయి. మరో రెండు గుడిసెలు పాక్షికంగా దగ్ధం అయ్యాయి. కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ ఘటన స్థలాన్ని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌తో కలిసి పరిశీలించారు. రెండు కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని కార్పొరేటర్ అందించారు.

'మహిళలకు కాంగ్రెస్ ఎప్పుడూ అండగా ఉంటుంది'

ఓల్డ్‌బోయినపల్లి: కాంగ్రెస్ పార్టీ ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం ఆమె నివాసంలో మహిళా కాంగ్రెస్ కమిటీని నియమించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, మాజీ పీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరిలు హాజరై నియామక పత్రాలను అందజేశారు. డివిజన్ సెక్రటరీ కె. పద్మ, వైస్ ప్రెసిడెంట్ మానసకళ్యాణి, పి. సంతోషమ్మ, పి. నిర్మల, కె. శ్వేతా, ఆర్గనైజింగ్ సెక్రటరిలు బి. దేవేంద్రమ్మ, ఇ. శ్రీదేవి, కె. కోమల, సెక్రటరిలు వై. భాగ్యలక్ష్మీ, ఏ. ఇందిరాలకు నియామకపత్రాలు అందజేశారు.

– ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ.. మహిళలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రి మండలిలో ఎక్కువ మంది మహిళలకు అవకాశం కల్పించి గౌరవించిందన్నారు. మహిళలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరి కూకట్‌పల్లి నియోజకవర్గంలో పార్టీని పటిష్టపర్చాలని తెలిపారు. కార్యక్రమంలో బోయినపల్లి డివిజన్ ప్రెసిడెంట్ మల్లికార్జున్‌యాదవ్, వివిధ డివిజన్ అధ్యక్షులు కృష్ణరాజ్‌పుత్, రమాదేవి, రేణుక, రాధా, తదితరులు పాల్గొన్నారు.


మహిళా కాంగ్రెస్ కమిటీసభ్యులకు నియామకపత్రాలు అందజేస్తున్న సత్యం శ్రీరంగం

హెచ్‌సీయూకు రూ.81.62 లక్షల గ్రాంట్ మంజూరు

రాయదుర్గం: హెచ్‌సీయూలో నైపుణ్య అభివృద్ధి కేంద్రంకు నిధులు మంజూరయ్యాయి. ఆధునిక జీవశాస్త్రంలో గ్రామీణ ప్రాంతాల సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి ఈ కేంద్రానికి రూ.81.62 లక్షల గ్రాంటును మంజూరు చేశారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ విభాగం పర్యవేక్షణలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తుంది. మూడు సంవత్సరాల కాలానికి భారత ప్రభుత్వం ఆరోగ్య పరిశోధన విభాగం (డీహెచ్ఆర్) ద్వారా ఈ నిధులు మంజూరు అయ్యాయి.

రేపటి నుంచి ఓటర్ల నమోదుపై ప్రత్యేక డ్రైవ్

హఫీజ్‌పేట్ : రానున్న ఎన్నికల నేపథ్యంలో చందానగర్ సర్కిల్ పరిధిలోని రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీలలో 10 రోజుల పాటు బీఎల్ఓ టీం ద్వారా ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నామని చందానగర్ ఉప కమిషనర్ వంశీకృష్ణ పేర్కొన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నూతన ఓటర్ల నమోదు, సవరణలు, ఓటర్ల జాబితాలో మార్పులు చేసుకోవడం కోసం ప్రత్యేకంగా సర్కిల్ పరిధిలోని రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీలలో డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. సర్కిల్ పరిధిలో 168 రెసిడెన్సీ, వెల్ఫేర్ అసోసియేషన్లు ఉన్నాయని 16 బీఎల్ఓ టీంలను ఏర్పాటు చేశామన్నారు. ఒక రోజు 10 కమ్యూనిటీ అసోసియేషన్‌లలో సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఒక కమ్యూనిటీ అసోసియేషన్ కార్యాలయంలో బూత్ లెవల్ ఆఫీసర్లు, ఒక సూపర్‌వైజర్, కంప్యూటర్ ఆపరేటర్ ఉంటారన్నారు. ఓటరు నమోదు, జాబితాలో సవరణలు, మార్పుల ప్రక్రియ ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయబడుతాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్


వెంకటేశ్వరనగర్‌లో పాఠశాలలో నులిపురుగు మందు వేస్తున్న కార్పొరేటర్ రోజాదేవి


ఎల్లమ్మబండలో చిన్నారులకు మందు వేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: నులిపురుగుల నివారణకు వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ డివిజన్ల కార్పొరేటర్లు రోజాదేవి, వెంకటేష్‌గౌడ్ గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నులిపురుగుల వల్ల పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత సమస్య ఏర్పడుతుందన్నారు. శారీరక పెరుగుదల, మానసిక అభివృద్ధి మందకొడిగా ఉంటుందని తెలిపారు. ప్రతి చిన్నారి ఈ మాత్రలు వేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, హరినాథ్, ఆంజనేయులు, శ్రావణ్ రెడ్డి, స్వరూప, భారతమ్మ, కమలమ్మ, సమ్మారెడ్డి, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు నులి పురుగుల మందు వేయించాలి

మోతీనగర్: చిన్నారుల (12ఏళ్ల)కు నులి పురుగుల మందును తప్పనిసరిగా వేయించాలని పర్వత్‌నగర్ ప్రభుత్వ పట్టణ ఆరోగ్య వైద్యాధికారి పిల్లలమర్రి విజయచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా గురువారం డివిజన్‌లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నులి పురుగుల మందు వేశారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులకు పలు సూచనలు అందజేశారు. పండ్లను, కాయగూరలను శుభ్రంగా కడిగిన తరువాతే వినియోగించుకోవాలని సూచించారు. భోజనం చేసేముందు, చేసిన తరువాత చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలన్నారు. చేతి గోర్లలో మట్టి పేరుకుపోకుండా చూసుకోవాలని సూచించారు. మనం నివసించే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటంతో పాటు పాదరక్షలు ధరించకుండా తిరగరాదని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయకుండా మరుగు దొడ్లను ఉపయోగించాలని విద్యార్థులకు సూచించారు. ఈ నులి పురుగుల మందును ప్రతి ఒక్క చిన్నారి వేసుకోవాలని తెలిపారు.


పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల మందును వేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజల ఆరోగ్యమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యం

మూసాపేట: భరత్‌నగర్ కాలనీ లైబ్రరీ ప్రాంగణంలో తెలంగాణ ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ కుటుంబ సంక్షేమ శాఖ వారు నిర్వహించే డెంగీ, మలేరియా, బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలు చేశారు. డాక్టర్ మౌనికగౌడ్ పర్యవేక్షణలో వైద్య చికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో సుమారు 150 మందికి వైద్య పరీక్షలు చేశామన్నారు. ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ వైద్య పరీక్షలను పరిశీలించారు. అనంతరం చిన్నారులకు నులిపురుగుల మందు వేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వేణుగోపాల్, సుదర్శన్‌రెడ్డి, విజయ్ కుమార్, సాంబశివరెడ్డి, సోమయ్య, చక్రి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


భరత్‌నగర్‌కాలనీ లైబ్రరీ ప్రాంగణంలో చిన్నారులకు నులిపురుగుల మందు వేస్తున్న కార్పొరేటర్

సినీనటి డింపుల్ హయతి సందడి



కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని నెక్సస్ హైదరాబాద్ మాల్‌లోని బజాజ్ ఎలక్ట్రానిక్స్‌లో రెడ్‌మీ 12 5జీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ నటి డింపుల్ హయతి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. వాచ్, 3 బ్లూటూత్ కాలింగ్, 12 రోజుల బ్యాటరీ లైఫ్‌తో పనిచేస్తుందన్నారు. భారత దేశంలో 5జీ కనెక్టివిటీకి కొత్త శకానికి నాంది పలికే దిశగా అడుగులు వేస్తున్నామని అన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

హఫీజ్‌పేట్ : జీహెచ్ఎంసీ చందానగర్ సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై అధికారుల అనుచిత వాఖ్యలకు గురువారం కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ చందానగర్ సర్కిల్ ఇంజనీరింగ్ విభాగంలో 56 మంది ఉండగా అందులో బోర్‌వెల్, కంప్యూటర్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నామన్నారు. ఇటీవల డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎక్కువగా ఉన్నారని తోటి ఉద్యోగులపై కూడా అనుచిత వాఖ్యలు చేస్తున్నారన్నారు. గత 15 సంవత్సరాల నుంచి ఔట్‌సోర్సింగ్‌లో వివిధ విభాగాలలో విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఇలా మాట్లాడడం బాధకరమంటూ ఉపకమిషనర్ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు.



సమస్యలపై రాజీపడే ప్రసక్తే లేదు

- పాదయాత్రలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రజల వద్దకే మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా మూడో రోజు ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాదయాత్ర కొనసాగించారు. గురువారం ఉదయం కోయబస్తీ చాముండేశ్వరీ ఆలయంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలసి ఆయన పూజలు చేశారు. అనంతరం పాదయాత్ర చేస్తూ దారిలో కనిపించిన హిందూ శ్మశానవాటికను పరిశీలించారు. అక్కడ నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. అనంతరం దాని అభివృద్ధికి రూ. 50లక్షల నిధులు విడుదల చేస్తున్నాట్లు వెల్లడించారు. వరద ముంపు నాలాకు రూ. 40 లక్షలను మంజూరు చేసి పనులు మొదలు ప్రారంభించామని తెలిపారు.

◆ హరిజనబస్తీ కమ్యూనిటీహాల్ కార్మ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న కుట్టు శిక్షణ కేంద్రానికి ఎమ్మెల్యే వెళ్లడంతో మహిళలు పెద్ద ఎత్తున మంగళహారుతులు పట్టి ఘనంగా స్వాగతం పలికారు. శిక్షణ పొందిన వారికి కుట్టు మెషిన్లను అందిస్తామని మహిళలకు హామీ ఇవ్వడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు.

◆ వర్షాలతో దెబ్బతిన రోడ్లు, డ్రైనేజీలను వెనువెంటనే పనులు చేయించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులు ఆలస్యం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ప్రజల కోసం పని చేస్తున్న మనం వారి సంక్షేమం, అభివృద్ధికి పని చేయాలని సూచించారు.

◆ నెల రోజులగా అనారోగ్యంతో ఆపరేషన్ చేయించుకున్న కూకట్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ గడ్డం నర్సింగ్‌రావును ఆయన ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బల్వంత్‌రెడ్డి, కర్రె జంగయ్య, నరేంద్‌గౌడ్, మక్కాల నర్సింగ్‌రావు, సయ్యద్ ఏజాజ్, కర్రె లావణ్య తదితరులు పాల్గొన్నారు.


సమస్యలు అడిగి తెలుసుకుంటున్నఎమ్మెల్యే

భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి ప్రాధాన్యం

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ పరిధిలోని జయనగర్, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1, 2 కాలనీలో రూ.56 లక్షల వ్యయంతో చేపట్టబోయే భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులకు గురువారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. నియోజవకర్గంలోని ప్రతి డివిజన్‌కు ఒక కిలోమీటర్ మేర భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు మంజూరు చేశామన్నారు. నిత్యం పొంగుతున్న ప్రాంతాల్లో మొదటి ప్రాధాన్యతగా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, నాయకులు, వార్డు, ఏరియా మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.


యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్